విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 10 నవంబర్ 2024 8 పేజీలు

రాష్ట్రంలో దళితులకు భద్రత ఏది?

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్
- రిమ్స్‌లో కారుమంచి అత్యాచార బాలికను పరామర్శించిన వైసీపీ నేతలు
- నిరాకరించిన పోలీసులు- రిమ్స్ వద్ద ఉద్రిక్తత

విశాలాంధ్ర-టంగుటూరు : మైనర్ బాలికపై అత్యాచారం జరిగి నాలుగు రోజులు గడుస్తున్న ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయించడానికి పోరాటం చేయవలసి వస్తుందని రాష్ట్రంలో దళితులకు భద్రత లేదని మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యాచారానికి గురైన మైనర్ బాలిక రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం విధితమే, వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి శనివారం అక్కడకు మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు, పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర, ఐద్వా జిల్లా అధ్యక్షులు కంకణాల రమాదేవి వెళ్లారు. అయితే బాధితుల కుటుంబాన్ని కలవడానికి పోలీసులు నిరాకరించారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడి పోలీసులకు వైసీపీ నేతలకు వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రస్తుతం మైనర్ బాలికకు వైద్యులు చికిత్స అందిస్తున్నారని ఆమెను కలవడానికి వీలులేదని ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు వైసీపీ నేతలకు దళిత సంఘాల నేతలకు సూచించారు. దీంతో వారు కేసు నమోదు అయితే ఎఫ్ఐఆర్ కాపీ చూపించాలని లేనిపక్షంలో బాధితులను కలవవచ్చునని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బాధితురాలిని కలవడానికి అనుమతి లేదని ఆమె తల్లిదండ్రులను కలవడానికి ముగ్గురిని మాత్రమే అనుమతించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మిగతా 2 లో ...

> **కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం**
>
> రిమ్స్ వద్ద జరిగిన ఘటనపై ఒంగోలు డిఎస్పి మాట్లాడుతూ బాధితులు తమకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాకపోవడం తోనే కేసు నమోదు చేయలేదని అన్నారు. బాలికకు తక్షణ వైద్యం అందిస్తూనే ఫిర్యాదు కోసం తల్లిదండ్రులను సంప్రదించగా వారు పేర్లను వెల్లడి చేయడానికి నిరాకరించారు. వారి బంధువుల సమక్షంలో ఈరోజు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు పై విచారణ చేసి నిందితులపై చట్ట పరిధిలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.
>
> - డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

వైసీపీ స్వార్థ రాజకీయాలు

సిగ్గుచేటు

- రాజకీయ లబ్దికోసం తప్పుడు ప్రచారం
- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌పై మంత్రి డోలా ఫైర్

విశాలాంధ్ర-టంగుటూరు : కారుమంచి ఘటనలో బాలిక భవిష్యత్ దృష్ట్యా విచారణ గోప్యంగా నిష్పక్షపాతంగా జరుగుతుంటే మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ బాలిక భవిష్యత్తును ఆలోచించకుండా స్వార్థపూరిత రాజకీయ లబ్దికోసం ఒంగోలు రిమ్స్ వైద్యశాల దగ్గర హడావుడి చేయడాన్ని రాష్ట్ర సాంఘిక శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తప్పుపట్టారు. వివరాల్లోకి వెళితే టంగుటూరు మండలం కారుమంచిలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన విషయం విదితమే. దీంతో ఆ బాలికను ఒంగోలులోని రిమ్స్‌లో చేర్పి చికిత్స అందిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులను పారిమర్శించేందుకు శనివారం మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు ఒంగోలు రిమ్స్ వరకు వెళ్లారు. అక్కడ వారిని పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి స్పందిస్తూ బాలికకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ చేపడుతుందని కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. మైనర్ బాలికపై జరిగిన ఘటనను గోప్యంగా ఉంచాల్సింది పోయి రాష్ట్రమంతా తెలిసేలా రాజకీయ లబ్దికోసం ఆదిమూలపు సురేష్, ఆ పార్టీ నేతలు రిమ్స్ దగ్గర హడావుడి చేయడాన్ని తప్పుపట్టారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండు లక్షల మంది మిగతా 2 లో ...

పదవుల జాతర

- జిల్లాలో జనసేనకు ఒకటి, టీడీపీకి మూడు అవకాశం
- ఆనందం వ్యక్తం చేస్తున్న తెలుగు తమ్ముళ్లు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తరువాత మరోసారి 59 మందికి నామినేటెడ్ పదవులను శనివారం ప్రకటించారు. దీనిలో భాగంగా జిల్లాలో నలుగురికి పలు కార్పొరేషన్ చైర్మన్ల పదవులు దక్కాయి. వీరిలో జనసేనకి ఒకటి కేటాయించగా మరో మూడు పదవులు తెలుగుదేశం పార్టీ నాయకులను వరించాయి. జిల్లాలో జనసేన పార్టీకి చెందిన పి విజయకుమార్‌కు ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని వరించగా, తెలుగుదేశం పార్టీకి చెందిన జాతీయ అధికార ప్రతినిధిగా ఉన్న మార్కాపురంకు చెందిన జీవీ రెడ్డితో పాటు ఏపీ ఆంధ్రప్రదేశ్ కల్చరల్ కమిషన్ చైర్మన్‌గా తేజస్విని, ఆంధ్రప్రదేశ్ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్‌గా రైతు విభాగానికి చెందిన మారెడ్డి శ్రీనివాసరెడ్డికి అవకాశం లభించింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చీరాలకు చెందిన సజ్జా హేమలతకు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌లూమ్స్ చైర్మన్ పదవి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రభుత్వం విడుదల చేసిన ఈ కార్పొరేషన్ చైర్మన్లలో ప్రకాశం జిల్లాకు సముచిత స్థానం లభించడం పట్ల జనసేన పార్టీలకు చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారం ఉన్నా లేకపోయినా పార్టీ కోసం పార్టీ సిద్ధాంతాల కోసం కట్టుబడి పనిచేసిన నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక కేసుల్లో ఇరుక్కొని ఇబ్బందులు ఎదుర్కొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు కార్పొరేషన్ చైర్మన్ల పదవులు కేటాయించడం పట్ల ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు ఏదో ఒక సందర్భంలో తగిన పదవి ఇచ్చి వారిని గౌరవించడం జరుగుతుందని దానిలో భాగంగానే తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులకు పలు కార్పొరేషన్ చైర్మన్ల పదవులు కేటాయించడం పట్ల ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లాలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్య నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జనసేన తరఫున మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన విజయకుమార్, నాగులుప్పలపాడు మండలానికి చెందిన వ్యక్తి. జనసేన పార్టీలో మొదటి నుంచి మిగతా 2 లో ...

విధేయతకు పట్టం



- బాపుడా చైర్మన్‌గా సలగల నియామకం
- నెలరోజుల ముందే చెప్పిన విశాలాంధ్ర
- జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన అభినందనలు
- ఎస్సీలకు సముచిత స్థానంపై హర్షం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : విశ్వసనీయత విధేయతగా 10 ఏళ్ల పాటు తెలుగుదేశం పార్టీలో మొక్కవోని దీక్షతో పార్టీ అభివృద్ధి విశేష కృషి చేసిన బాపట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పదవి కేటాయించటంపై హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో వివాద రహితుడుగా సౌమ్యుడిగా దళిత పెద్దన్నగా పేరుగావించిన సలగలకు సముచిత స్థానం దక్కటంపై దళిత సంఘాలు, ఆయన సమకాలీకులకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో కార్యకర్త స్థాయి నుంచి ఉన్నత పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిని ఆపాయ్యతగా పలకరిస్తారని సలగలకు పేరుంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల ముందు సలగల రాజశేఖర్‌బాబుకు పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టారు. అప్పటి నుంచి జిల్లాలో పర్యటిస్తూ పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన ఆరు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. రాజకీయ అనుభవం రాజకీయ కుటుంబ నేపథ్యంలో సలగల తనదైన శైలిలో అన్నీ వర్గాల ప్రజలతో చొచ్చుకుపోయి టీడీపీ గెలుపే లక్ష్యంగా విశ్రమించక మిగతా 2 లో ...

2 లో రికార్డులు సక్రమంగా ఉండాలి : కలెక్టర్

6 లో మహిళలకు చట్టాలపై అవగాహన

ఏఐపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ సంస్థ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్ఫామ్స్ సహకారంతో అప్లై జనరేటివ్ ఏఐ కోర్సును ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా పృథ్వి ఆదిశేష ఐశ్వర్య రాజీవ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా పృథ్వి ఆదిశేష మాట్లాడుతూ ఈ సర్టిఫికేషన్ ప్రోగ్రాంలో చివరి ఘట్టం లో ఓపెన్ ఏఐ జిపిటి త్రీ మోడల్స్ అండ్ ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై కోర్స్ నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇన్ఫోసిస్ తరఫున సర్టిఫికేషన్ అందజేస్తామని వారు తెలియజేశారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని సర్టిఫికేషన్ పూర్తి చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కె రూప అక్కేష్, డీన్ అకాడమిక్స్ డాక్టర్ సివి సుబ్బారావు,కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ గిరిబాబు, కాలేజీ లెవెల్ ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ కన్వీనర్ శ్రీమతి కె స్వర్ణలత, విద్యార్థులు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

విధేయతకు పట్టం (మొదటిపేజీ తరువాయి)

పనిచేశారు. 2019,2024లో బాపట్ల పార్లమెంట్ సీటు ఆశించి ఆఖరిలో భంగ పడ్డారు. అయినా ఏనాడు కూడా పార్టీని విడవక పార్టీలోనే ఉంటూ తనకు కేటాయించిన పనిని తూచా తప్పకుండా పనిచేసుకుంటూ ముందుకు వెళ్లారు. ప్రతి నాయకుని సూచనలు సలహాలు పరిగణలోకి తీసుకుని పార్టీలో ప్రతి వ్యక్తిని భాగస్వామ్యం చేసి తనదైన మార్కును సంపాదించుకున్నారు. సేవ కార్యక్రమాల్లో ముందుండే సలగల రాజకీయాల్లో తనకు కేటాయించిన పదవికి వన్నె తెస్తారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బాపట్ల అర్బన్ డవలప్ అథారిటీ చైర్మన్‌గా ప్రకటించటంపై జిల్లా వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సలగలకు అభినందనలు తెలిపారు. వీరితో జిల్లాలోని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు సలగలకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. సలగలకు చైర్మన్ పదవి రావటంపై ఆయన అభిమానులు బాపట్లలో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

సిగ్గుచేటు (మొదటిపేజీ తరువాయి)

మహిళలపై అఘాయిత్యాలు జరిగితే అప్పుడు మంత్రిగా ఉన్న సురేష్ ఏం చేశారని ప్రశ్నించారు. లేని దిశ చట్టం పేరుతో మహిళను మోసం చేశారని అన్నారు. చిత్తూరు జిల్లాకు తమ కూతురిపై అత్యాచారం జరగలేదని బాలిక తల్లిదండ్రులు చెబుతున్నా అక్కడ వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాజకీయ లబ్ధికోసం వైసీపీ నాయకులు బాలికల గౌరవానికి భంగం వాటిల్లేలా తప్పుడు ప్రచారం చేయడం మంచి కాదని హితవు పలికారు. కొండేపి నియోజకవర్గంలో మూడుసార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టినా వారికి సిగ్గు రాలేదని అన్నారు.

ఘనంగా కడియాల రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకులుకడియాల రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి కడియాల లల్లి సాగర్జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నగర్ పంచాయతి చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ప్రారం సుబ్బారావు సందు రామయ్య, పసులకు వెంకటరామయ్య, మారెళ్ళ వెంకటేశ్వర్లు, కల్వకులను శేఖర్ బాబు, గొర్రె సుబ్బారెడ్డి, మళ్లీ, యాదగిరి వాసు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రికార్డులు సక్రమంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఆసుపత్రికి, రోగులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శనివారం ఆమె కొత్తపట్నం మండలంలోని ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి నెల కాన్పుల కోసం ఎంతమంది ఆసుపత్రికి వస్తున్నారు, ఎన్నో కాన్పు కోసం వస్తున్నారు, గర్భిణి అని నిర్ధారణ అయినప్పటి నుంచి వారికి అందిస్తున్న మందులు, వారి ఆరోగ్య పర్యవేక్షణ తదితర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్, కాన్పుల గది, ఆఫీసును పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ లో సంతకం చేసిన సిబ్బంది అందరూ వాస్తవంగా విధులలో ఉన్నారో లేరో కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా ఉద్యోగుల విధులకు సంబంధించిన విధివిధానాలు, వారు నిర్వహిస్తున్న రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. ఓ.పీ.ల నమోదు రిజిస్టర్లు, ఎనీమియా రిజిస్టర్లు, ల్యాబ్ రిజిస్టర్ల నిర్వహణలో నిర్దిష్ట విధానం లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ఆసుపత్రుల రిజిస్టర్ల నిర్వహణలో ఏకరూపత (యూనిఫామ్) ఉండేలా చూడాలని డీఎంహెచ్వో సురేష్ కుమార్‌ను ఆదేశించారు. ప్రసవ అంచనా తేదీ (ఈ.డి.డి), ఆశాల సమావేశం, కుటుంబ ప్రణాళిక రిజిస్టర్లను కలెక్టర్

తనిఖీ చేశారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ విషయాలలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులకు ఆమె స్పష్టం చేశారు. గర్భిణులకు స్వయంగా వైద్యాధికారులే బీపీ చెక్ చేయాలని కలెక్టర్ చెప్పారు. ఆసుపత్రిలో అందించే సేవలను డిస్ప్లే బోర్డు పెట్టాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డి.సి.హెచ్.ఎస్. సూరిబాబు, తహసీల్దార్ మధుసూదన్ రావు, వైద్యాధికారులు శివపార్వతి, నవ్యారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపులో అక్రమాలు :అన్నా

విశాలాంధ్ర-మార్కాపురం : డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో ఇటీవల ఆక్రమణల తొలగింపు విషయంలో అధికారులు ఒకే రీతిన కాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అధికారులు తీరుపై ధ్వజమెత్తారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి కోసం, ట్రాఫిక్ క్రమబద్దీకరణకు, ఆక్రమణల తొలగింపుకు మేము వ్యతిరేకం కాదన్నారు. కాలువలు హద్దుగా తీసుకొని ఎంక్రోచ్మెంట్ చేశారా? ప్రభుత్వ భూమిని గుర్తించి ఎంక్రోచ్మెంట్ చేశారా? స్పష్టత ఇవ్వాలన్నారు. కాలువలను హద్దుగా చేసుకుంటే కాలువలు దాటి లోపలికి వెళ్లి బిల్డింగ్స్ ఎందుకు కూల్చారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఇక్కడ మీరు పార్టీలను దృష్టిలో పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు అనేది ప్రజలందరూ గుర్తించారని అన్నారు. సబ్ కలెక్టర్, కమిషనర్ ఇతర అధికారులు ఈ విషయంలో ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రెస్‌మీట్‌లో రాజకీయాలకు అతీతంగా ఎంక్రోచ్మెంట్ చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నా వెంట వస్తే ఎక్కడెక్కడ ఎంక్రోచ్మెంట్ జరగలేదు, ఎక్కడెక్కడ ఎంక్రోచ్మెంట్ జరగాల్సిన దానికన్నా ఎక్కువ జరిగిందో చూపిస్తానని అన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు విషయంలో మీరు అధికారుల వద్ద నుంచి పూర్తి సమాచారంతో వస్తే బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. గత ప్రభుత్వంలో దేవాలయాల భూములు, ఇతర భూములు ఆక్రమించుకున్నారని మా పార్టీ మీద నిందలు మంచి పద్ధతి కాదన్నారు. ప్రస్తుతం మీ కూటమి అధికారంలో ఉంది కదా.. విచారణ జరిపించండి.. ఎవరైతే భూములు ఆక్రమించుకున్నారో వారిపై కేసులు పెట్టండి, ప్రజలకు న్యాయం చేయండి అని పిలుపునిచ్చారు. తప్పు చేస్తే మా పార్టీ కార్యకర్తలైన మందలించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తేల్చి చెప్పారు. మా పార్టీలో ఎవరైనా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని తీవ్రస్వరంతో పేర్కొన్నారు. పదేపదే మా పార్టీ మీద బురద చల్లడం కాకుండా అధికారంలో ఉన్న మీరు గత ప్రభుత్వంలో తప్పులు చేసిన వారిని కోర్టుకు ఈడ్చి ప్రజలకు న్యాయం

చేయాలని హితవు పలికారు. ఈ ప్రాంతానికి ఎంతో అవసరమైన మెడికల్ కళాశాలను నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేసి ఒక పనులు ప్రారంభించి చివరి దశకు తీసుకొచ్చారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులు పూర్తి చేయకపోగా మరోవైపు ఉన్న డాక్టర్లు అందరూ వ్యతిరేక ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీ బెగ్,మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, ఎంపిపి బండి లక్ష్మీదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు ముంగమూరి శ్రీనివాస్,కొత్త కృష్ణ, బుశ్శెట్టి నాగేశ్వరరావు, ఎం .సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల జాతర (మొదటిపేజీ తరువాయి)

పనిచేశారు. ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు నమ్మినబంటుగా ఉన్నారు. దీంతో విజయ్‌కుమార్‌కు కార్పొరేషన్ పదవిని పవన్ కళ్యాణ్ కేటాయించడం పట్ల ఆ పార్టీకి చెందిన నేతలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జీవిరెడ్డి మార్కాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తి. తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహి స్తున్నారు. ప్రతిపక్షంలో వైసీపీ అరాచకాలను ఎండగడుతూ పార్టీకోసం పనిచేశారు. దీంతో అతనికి ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. ఏపీ కల్చరల్ కార్పొరేషన్ చైర్మన్ తేజస్వినిని వరించింది. తేజస్విని తెలుగుదేశం విద్యార్థి విభాగంలో పనిచేశారు. అదే విధంగా ఏపీ స్టేట్ అగ్రికల్చరల్ మిషన్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసరెడ్డికి పదవి వరించింది. ఈయన తెలుగురైతు విభాగం జిల్లా కార్యదర్శి, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి నమ్మినబంటుగా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన నాయకులు అనేక ఇబ్బందులకు గురిచేసినప్పటికీ వాటిని ఎదుర్కొని నిలబడ్డారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం కొలువుదీరిన తరువాత మారెడ్డికి చైర్మన్ పదవి ఇవ్వడం పట్ల టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో ఒక్క జనసేన, మూడు తెలుగుదేశం పార్టీకి చెందిన మూడు కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి.

దళితులకు భద్రత ఏది?

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని నాలుగు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలే ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నంద్యాలలో బద్వేల్ లో గుంటూరులో మహిళలపై, మైనర్ బాలికల మీద అఘాయిత్యాలు 100కు చేరువవుతున్నాయన్నారు. అత్యాచారానికి గురై చంపేస్తే కనీసం వారి శవం దొరకడం లేదంటే వ్యవస్థ ఎలా పని చేస్తుందో అర్థమవుతుందన్నారు. పోలీసులు ఒత్తిళ్లకు లోనై చట్టం రాజ్యాంగానికి లోబడి పని చేయడంలేదన్నారు. వ్యవస్థ ఒక్కరికి మాత్రమే ఊడిగం చేస్తూ ప్రజల కోసం శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. మైనర్ బాలికల మీద అఘాయిత్యాలు జరుగుతుంటే విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఏం చేస్తున్నారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో ఏర్పాటు చేసిన దిశా పోలీస్ స్టేషన్లో ఎందుకు వాడుకోవడం లేదని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న పంతంతో ఆయన చేసిన సంస్కరణలను అమలు చేయటం లేదని ఫలితంగా దళిత జాతి మహిళలు నష్టపోతున్నారన్నారు. కారుమంచి గ్రామం లో మైనర్ బాలికపై అత్యాచారం జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయలేదని విద్యాశాఖ అధికారులను అడిగితే వారి మీద, వీరు వీరి మీద వారు చెప్పుకోవడం. సభ్య సమాజం తలదించుకునేలా పోలీసు వ్యవస్థ పని చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా కీచకులకు న్యాయస్థానం ముందు నిలబెట్టి కఠినమైన శిక్షలు అమలు అయ్యేలాగా పోలీసులు పనిచేయాలని కోరారు. బాధితురాలికి వారి కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందని ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ నిర్ధారించినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనక కారణమేమిటని ప్రశ్నించారు. ఓ మహిళా కానిస్టేబుల్ బాధితుల ఇంటికి వెళ్లి కేసు పెట్టవద్దని వారిని భయభ్రాంతులకు గురి చేశారని ఆరోపించారు. పాఠశాలలో కీచక ఉపాధ్యాయుని తక్షణమే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ ఆహారం కోసం బ్రతకడం కోసం ప్రజలు వలసలు వెళుతూ ఉంటారు, కానీ రాష్ట్రంలో దళితులు మానప్రాణాల కోసం వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేరం చేసిన వారిని అదుపులోకి తీసుకోకుండా బాధితురాలికి బంధువునైన నేను పరామర్శించడానికి వెళుతుంటే పోలీసులు అడ్డుకో వడం విడ్డూరంగా ఉందన్నారు. సాంఘిక శాఖ మంత్రి ఇలా కలో దళిత సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచారం జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయలేదని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర హోం మంత్రి అనిత వెంటనే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని లేదంటే ద్రోహులుగా మిగిలిపోతారని డిమాండ్ చేశారు.

గోల్డెన్ గ్రానైట్‌లో భద్రతా తనిఖీలు

విశాలాంధ్ర-చీమకుర్తి : ఆర్.ఎల్.పురం పంచాయతీ పరిధిలోని గోల్డెన్ గ్రానైట్‌లో భద్రతా తనిఖీలు శనివారం నిర్వహించారు. 22వ గనుల భద్రత వారోత్సవాలలో భాగంగా వివిధ క్వారీలలో శనివారం భద్రత తనిఖీల టీములు విస్తృతంగా తనిఖీలు చేశారు. గోల్డెన్ గ్రానైట్‌లో టీం లీడర్ ఎస్. మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీం సభ్యులు వివిధ విభాగాలలో తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీం సభ్యులను ఆయన స్వాగతం పలికారు. సేఫ్టీ వీక్ పతాకాన్ని ఆవిష్కరించారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ.గిరిబాబు, ఫస్ట్ క్లాస్ మేనేజర్ యు.ఫణి కుమార్, సేఫ్టీ వీక్ కమిటీ జాయింట్ సెక్రెటరీ ఏ. రవి కుమార్, సభ్యులు టీవీ లోకేష్, కుమారస్వామి,డి. శ్రీనివాసరావు,డాక్టర్ ఎస్కే నాయబ్ రసూల్, మెకానికల్ ఇంచార్జ్ నారాయణరెడ్డి, సెల్వం పాల్గొన్నారు.యాపిల్ గ్రానైట్ గనిలో జరిగిన భద్రతా తనిఖీల కార్యక్రమంలో యాపిల్ గ్రానైట్ ఏజెంట్ శిద్దా పవన్ కుమార్,టీం సభ్యులు పాల్గొంటున్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఈ నెల 11న ఎస్సీ వర్గీకరణ విజయసారథి మందకృష్ణ మాదిగ సోమవారం ఒంగోలు పట్టణమందు మాదిగల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని మండలం లోని మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గూడూరి శేఖర్ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ ఒంగోలు పట్టణములోని అద్దంకి బస్టాండ్ సెంటర్ నుండి మధ్యాహ్నం మూడు గంటలకు విజయోత్సవ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 13వరకు ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి నందు రాష్ట్ర స్థాయి అండర్ 11 బాల బాలికల మిని బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమి ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీ కృష్ణ ఒక ప్రకటనలో తెలియచేశారు. బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ వివరాలను ఎమ్.రఘుబాబు, ఏ.శశిధర్,ఫోన్‌నంబర్లు 9905756789, 9398260109ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవలసినదిగా మురళీ కృష్ణ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి మండలం లోని కంచర్ల వారి పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఈనెల 14 బాలల దినోత్సవం పురస్కరించుకొని కనిగిరి నియోజకవర్గ స్థాయిలో టెన్త్ విద్యార్థులకు , కనిగిరి మండల స్థాయిలో ఐదో తరగతి విద్యార్థులకు నవంబర్ 11న ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. విజయ భాస్కర్ రెడ్డి తెలియజేశారు. ప్రతిభా పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా మొత్తం రూ.15,000 నగదు బహుమతులను సువేన్ ఫౌండేషన్ ,కె.వి రెడ్డి, రెడ్డంవారిపల్లి సౌజన్యంతో అందజేస్తారన్నారు.

ఘనంగా ఏపీ హేతువాద సంఘం మహాసభలు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్ (సీపీఐ కార్యాలయం) నందు ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభమైనాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సభకి అధ్యక్షత వహించిన ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకట సుబ్బయ్య ప్రారంభ ఉపన్యాసం చేస్తూ భావవాద జాడ్యం అంటువ్యాధి లా ప్రబలుతున్న ప్రస్తుత సామాజిక పరిస్థితులలో హేతువాద భావజాల ఆవశ్యకత పెరిగిందని శాస్త్రీయ ఆలోచనపరుల క్రియాశీలకత్వం ఇప్పుడు సామాజిక అభివృద్ధికి అవసరమన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ పాత్రికేయులు, పత్రికా సంపాదకులు కె. శ్రీనివాస్ ప్రసంగిస్తూ మారుతున్న కాలమాన పరిస్థితులలో దానికి తగ్గట్లుగా హేతువాద ఉద్యమ భావజాల ప్రచారం మారాల్సిన అవసరం ఉందని మనకి రాబోయే తరాల మీద నమ్మకం, విశ్వసనీత ఉండాలని నేటి యువత ఆలోచనాపరులుగా ఉన్నారని ఆశాభావం వ్యక్తపరిచారు. మరో వక్త పౌర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముప్పాళ్ళ సుబ్బారావు ప్రసంగిస్తూ పౌర హక్కులు ఈ దేశంలోని ప్రజలందరికీ సమానంగా ఉన్నాయని కానీ వాటి విషయమై ప్రజలలో చైతన్యం లేదని ఆ చైతన్యాన్ని కల్పించాల్సిన బాధ్యత హేతువాద ఉద్యమం మీద ఉందన్నారు. మరో వక్త మానవ వికాస వేదిక నాయకులు బి. సాంబశివరావు ప్రసంగిస్తూ మతం, భక్తి అనేవి పూర్తిగా వ్యక్తిగత విషయాలని ఎవరికి ఇష్టమైన వాటిని వారు ఇతరులకు ఇబ్బంది లేకుండా అనుసరించాలే కానీ రాజ్యం, పరిపాలనాది అంశాలలో వీటి ప్రమేయం ఉండరాదని దీనికి భిన్నంగా ఈ దేశంలో జరుగుతుందని దీనిని అడ్డుకో వలసిన అవసరం ఉందన్నారు. మధ్యాహ్న శేషన్స్‌లో ప్రముఖ ఉద్యమ నాయకురాలు శ్రీమతి కృష్ణప్రియ అధ్యక్షత వహించి సామాజిక రుగ్మతల మీద ప్రసంగించగా... డా. బీరం సుందరరావు నాస్తికత్వం-ఆచరణ అనే అంశంపై ప్రసంగించారు. ప్రముఖ శాస్త్రవేత్త రఘునందన్ విశ్వం దాని పుట్టుక పరిణామం అందులోని గెలాక్సీలు నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు వీటి గురించి కులంకషంగా ప్రసంగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, షర్మిల, రాచపాలెం రఘు, డాక్టర్ దాసరి తిరుపతి, నరసింహారావు, సిపిఐ కార్యదర్శి నారాయణ , చంద్రశేఖర్, రంగారెడ్డి మరియు 26 జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గొట్టిపాటి జన్మదిన వేడుక

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టీడీపీ నాయకులు కడియాల రమేష్ పుట్టినరోజు సందర్భంగా కల్లూరి సుబ్బు ఆధ్వర్యంలో దర్శి కురిచేడు రోడ్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం జన్మదిన కేక్‌ని నగరపంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నారపు శెట్టి పిచ్చయ్య, మారెళ్ళ వెంకటేశ్వర్లు, మాగం సుబ్బారావు మారం శ్రీనివాస్‌రెడ్డి ఊరిబిండి మధు, మాదాసు నాగరాజు ఆరికొండ చందు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి పట్టణంలోనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కొరకు ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున హనుమంతునిపాడు మండల పరిధిలోనే ఉన్న ఉమ్మనపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముప్ప రంగసాయి యాదవ్, ముప్ప రంగా మరియు మాజీ ఎంపీటీసీ పెన్నా గురవయ్యలు కలిసి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతులమీదుగా రూ.50వేలు అంద చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో సానికొమ్ము వెంకటేశ్వర్‌రెడ్డి, గాయం కృష్ణారెడ్డి , టీడీపీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

నేడు స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో ఆదివారం జరగబోయే ఓటర్ల సవరణ సందర్భంగా మండలం లోని ఆయా పంచాయతీల పరిధిలో సచివాలయాల వద్ద స్పెషల్ డ్రైవ్ కార్య క్రమం బీఎల్‌వోలు నిర్వహిస్తారని, ఏ పంచాయతీ ప్రజలు ఆ పంచాయతీలోనే మార్పులు చేర్పులు చేసుకోవాలని, ఒక పంచాయతీ వారు ఇంకొక పం చాయతీ లోకి వెళ్ళవద్దని సూచించారు. కొమరోలు టౌన్ వరకు చిన్న బడిలోనూ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనూ ఓటర్ల సవరణ కేంద్రాలు ఉంటాయని తహశీల్దార్ భాగ్య లక్ష్మి తెలిపారు.

ఉచిత మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురం కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో శీలంవారిపల్లి గ్రామంలో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది ద్వారా గ్రామంలోని ప్రజలకు ఉచితంగా రక్తపరీక్షలు చేసి అనేక రకాల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ పి రఘుపతి,వైద్యసిబ్బంది, నర్సు రమ, విద్యార్థులు, గ్రామప్రజలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి శ్రీవిద్యా,తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు దండు ఆశశ్రీ ఎంపిక

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలుకు చెందిన దండు శ్రీనివాస్ ప్రమోదా దంపతుల కుమార్తె దండు ఆశ శ్రీ ఇటీవల విజయవాడలో జరిగినటువంటి ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ అండర్ 13 విభాగం నందుసింగిల్స్, డబుల్స్‌లో ద్వితీయ స్థానంలో విజయం సాధించి తన ప్రతిభను చాటింది. ఈ సందర్భంగా ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంశీధర్ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 30 వరకు జమ్మూ అండ్ కాశ్మీర్‌లో జరగబోయే సబ్ జూనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు దండు ఆశ శ్రీ ఎంపికవడం గర్వకారణం అని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సంఘం ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, శేషి రెడ్డి మరియు కోచ్ అమ్మన్ గౌడ్ లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రెసిడెంట్ అద్దంకి మురళి కృష్ణ ప్లేయర్స్ ఆశ శ్రీను అభినందించారు.

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుక

విశాలాంధ్ర-కనిగిరి : ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఘనంగా నిర్వహించారు. వైసీపీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, వైస్ చైర్మన్ మాణిక్యాల రావు, పిసిపల్లి మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, సియస్ పురం మండల కన్వీనర్ భువనగిరి వెంకటయ్య,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : టీడీపీ కార్యకర్తలు సభ్యత్వ నమోదు చేసుకొని భరోసా పొందాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి గౌడకట్ల హరికృష్ణ కోరారు. శనివారం మండలంలోని మొగులూరు, వెలిగండ్ల గ్రామాలలో టీడీపీ మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తలు అభిమానులు టీడీపీ సభ్యత్వాన్ని పొందాలని తద్వారా పార్టీ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచి చిలకల సుబ్బరత్నమ్మ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కొండు విజయభాస్కర్‌రెడ్డి, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి యద్దనపూడి సాల్మన్ రాజ్, చెంచి రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కోటి సోమవారాలు

విశాలాంధ్ర-చీమకుర్తి : కార్తీక మాసం ఏడవ రోజు శ్రవణా నక్షత్రంతో కూడిన కోటి సోమవారాలు పర్వదిన సందర్భంగా స్వామివారి అర్చనలు, ధూపదీప నైవేద్యాలతో హరిహర క్షేత్రం శివనామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొని కార్తీక దీపాలను వెలిగించి,అనంతరం ఆలయంలో వేంచేసియున్న అయ్యప్ప స్వామి వారి యొక్క పడి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంట శిద్దా పవన్ వారి దంపతులు, గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరిబాబు పాల్గొన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com ఆదివారం 10 । నవంబర్ । 2024

ఓటు నమోదు చేసుకోండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని దర్శి నియోజకవర్గ రిజిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ ఎంబీఎస్ లోకేశ్వరరావు అన్నారు. దర్శి నియోజకవర్గంలోని స్పెషల్ సమ్మరీ రివిజన్లో భాగంగా ముండ్లమూరులోని పోలింగ్ బూతులను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు 2025 జనవరిలో ప్రచురితం కాబోయే ఓటర్ల జాబితా లిస్టును అందుబాటులో ఉంచుతూ, కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్ల తొలగింపును, స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ ఆర్ శ్రీకాంత్, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ ఏ ప్రవంతి, రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ పోగుల శేషగిరిరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మేదరమెట్ల రాఘవ పాల్గొన్నారు.

జీజీ హెచ్ పర్యవేక్షకురాలిగా డాక్టర్ జమున

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : జీజీహెచ్ పర్యవేక్షురాలిగా డాక్టర్ టి జమున శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సైకాలజీ హెచ్ ఓడి దుర్గాదేవి ఈ బాధ్యతలు చూసారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జమునను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు, సూపరిండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ పలు విభాగాల హెచ్ ఓడీలు, అడ్మినిస్ట్రేషన్, నర్సింగ్ సిబ్బంది. కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జమున మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత మేరకు మెరుగైన వైద్య సేవలు వేగంగా ప్రజలకు అందేలా కృషి చేస్తానని అన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామాలలో పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దర్శి సీఐ రామారావు అన్నారు. మండలంలోని శంకరాపురం గ్రామాన్ని శనివారం ఎస్సై వై నాగరాజుతో కలిసి సందర్శించారు. గ్రామ ప్రధాన వీధుల్లో తిరుగుతూ గ్రామస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల అనంతరం జరిగిన గొడవలకు సంబంధించి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ అంకారావు, కానిస్టేబుల్ ఏసుబాబు, మరియ బాబు, కాశి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమానికి సరుకుల వితరణ

విశాలాంధ్ర-కురిచేడు : కూటమి ప్రభుత్వములో రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాయపాటి శ్రీనువాసులు ఆవులమంద పంచాయతీలో రామాంజనేయ కాలనీలో ఏర్పాటైన శ్రీ భవాని వృద్ధుల ఆనంద నిలయం లో కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. అంతేకాకుండా ఆశ్రమానికి వారానికి సరిపడా వంట సరుకులు బియ్యము పలు రకాల పండ్లను అందించారు.

క్రైస్తవ దళితులకు ఎస్సీ హోదా కల్పించాలి : గద్దపాటి

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కళా క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో దళిత ఉద్యోగుల యునైటెడ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా అనుమతిని సాధించడంలో ఉన్న ప్రాధాన్యతపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు గద్దపాటి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఒక అత్యవసరమైన పరిష్కారమని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి అందించిన మత స్వేచ్ఛ హక్కులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాజ్యాంగం ప్రకారం, దేశంలోని ప్రతి వ్యక్తికి తమ నమ్మకాల ప్రకారం తమ ఇష్టమొచ్చిన మతాన్ని స్వీకరించుకోవడమనే హక్కు ఉందన్నారు. అయితే, క్రైస్తవ మతంలోకి మార్పు కున్న దళితులు తమ ఎస్సీ హోదా కోల్పోవడం దారుణమైన వివక్ష అని ఆయన అభిప్రాయపడ్డారు. మత మార్పిడి చేసుకున్నందుకు మౌలిక హక్కులు కోల్పోవడం అసమానతలకు దారితీస్తుందన్నారు. 2007లో భారత ప్రభుత్వానికి సూచించిన రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు పై గద్దపాటి ప్రస్తావించారు. ఈ కమిషన్, అన్ని మతాలలో ఉన్న దళితులకు ఎస్సీ హోదా కల్పించాలి అనే సూచన చేసిందన్నారు. ప్రస్తుతం ముస్లిం మరియు క్రైస్తవ దళితులకు ఎస్సీ హోదా లేకపోవడం, భారత రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం, న్యాయం లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని ఆయన అన్నారు. రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫార్సులు ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడం దేశంలోని లక్షలాది దళిత క్రైస్తవులకు న్యాయం అందకుండా చేస్తున్న దురవస్థని నొక్కిచెప్పారు. బాలకృష్ణన్ కమిషన్, 2023లో భారత ప్రభుత్వం నియమించినది. దీని ప్రధాన లక్ష్యం దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పన అంశంపై పరిశీలించటం. ఈ కమిషన్, రంగనాథ్ మిశ్రా కమిషన్ సూచనలు అమలు చేయకపోవడంతో, వాటి ప్రామాణికతను పరిశీలిస్తూ, మళ్లీ అధ్యయనం చేసే ఉద్దేశంతో ఏర్పాటయిందన్నారు. ఇది కేవలం ప్రభుత్వం ఈ విషయంపై కాలయాపన చేయడానికే వేసిన కమిషన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎన్నికల సమయంలో టిడిపి హామీ ఇచ్చిన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా హామిని నిలబెట్టుకోవాలి అని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తమ ద్వంద వైఖరి మానుకొని దశాబ్దాలుగా వివక్షకు గురవుతున్న దళితులకు న్యాయం చేయాలి అని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ద్వారా మేలు పొందిన వారిలో ఎంతో మంది ఉద్యోగస్తులు అన్నారు అని. కాబట్టి వారికి సమాజం యొక్క మేలు కొరకు పని చేయడంలో మరింత ఎక్కువ భాధ్యత ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ హోదా లేని కారణంగా వారు అనేక సామాజిక, ఆర్థిక అవకాశాలు కోల్పోతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఆర్ఎస్ సెల్వన్ రాజ్, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగసంఘాల నాయకులు ఎలక్ట్రిసిటీ సుధీర్, పాలపర్తి విజేష్ రాజ్, రిటైర్డ్ ఆర్ఎస్ఐ తిమోతి, పాలపర్తి ఆల్బర్ట్ మాథ్యూస్, బిషప్ సంసన్, గూడూరి రవి కుమార్ పాస్టర్, డేవిడ్ రాజు,,పెద్దన్న,యేసు దాస్, విజయేంద్ర బహుజన, రాయపాటి జగదీష్, పాలపర్తి మోహన్, పాస్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తనిఖీ

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని 9, 10, 11, 12, 13, 14, 15, 16,42, 43 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.రమాదేవి ప్రత్యేక క్యాంపెయిన్లో భాగంగా శనివారం పరిశీలించారు. ఓటర్ల జాబితాను పరిశీలించి ఫారం 6, ఫారం 7, ఫారం 8లకు సంబంధించి ఓటర్లను, ఇంటి నంబర్లేని గృహాలు, తప్పు అక్షరాలు, స్పష్టత లేని ఫోటోలు గురించి బిఎల్ఓలకు తగు సూచనలు చేశారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ : మన్నం

విశాలాంధ్ర-పామూరు : కార్యకర్తలకు అండగా నిలిచే ఏకైక పార్టీ తెలుగుదేశం అని మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య అన్నారు. శనివారం స్వగ్రామమైన కంబాలదిన్నె లో శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు పిలుపుమేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రమణయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్ర మంలో చుంచు కొండయ్య, ఉడత కిషోర్, సానుమూరు శ్రీనివాసులు, గోళ్ళ కేశవ, గుది వెంకటనారాయణ, వడ్లమూడి మోహన్రావు, రాయి వెంకటేశ్వర్లు, గోళ్ళ కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రజా పోరు కరపత్రాలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-టంగుటూరు: ప్రజా పోరు కరపత్రాలను టంగుటూరులో సిపిఎం పార్టీ నాయకులు ఆవిష్కరించారు. సందర్భంగా సిపిఎం టంగుటూరి ఏరియా కమిటీ కన్వీనర్ రాము మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న తహసీల్దార్ కార్యాల యం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు విలు వగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయ కులు వి మోజేష్ కే శ్రీని వాసరావు ఎం యానాది టీ పోపారావు జి పాల్సన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణ బీజేపీ ఆఫీస్లో పట్టణ అధ్యక్షులు అపిసెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో క్రియా శీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కార్య క్రమంలో ముఖ్య అతిథిలుగా జిల్లా ఉపాధ్యక్షులు భవ నాసి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె వి నారాయణ మరో ముఖ్య అతిథిగా సంధ్యాల జిల్లా సంధ్యాల పట్టణ జనరల్ సెక్రటరీ చల్లా మధు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ, జిల్లా ఓబిసి ప్రధాన కార్యదర్శి బాదుల్లా, ఓ బి సి కార్య వర్గ సభ్యులు వీర చక్రము,సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు కొప్పరపు నాగేశ్వర రావు,జనరల్ సెక్రటరీ మునగ నూరి రామకృష్ణ, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, సీనియర్ నాయకులు చంద్రమోహన్,జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు పాల్గొన్నారు.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర/ ఒంగోలు : తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుంచి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్కు సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్ మరింత స్పెషల్ చేస్తోందన్నారు. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడలన్నారు.

డిఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన డీఎస్సీ స్క్రీనింగ్ టెస్ట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిడి లక్ష్మా నాయక్ తెలిపారు. సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు సంయుక్తంగా డీఎస్సీ ఉచిత కోచింగ్, వసతి నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానించగా 5050 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అందులో స్క్రీనింగ్ నిమిత్తం ఈనెల 10న నిర్వహించ తలపెట్టిగా ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడినట్లు చెప్పారు. తదుపరి తేదీని మరలా ప్రకటిస్తామని తెలిపారు.

ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపెయిన్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఓటర్ నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ డేలో భాగంగా శనివారం మండలంలోని చిన్నారి కట్ల, పెదారికట్ల, గరిమనపెంట, గొట్లగట్టు తదితర గ్రామాల్లో బీఎల్ఓ, కేంద్రాలను తహసీల్దార్ ఆవుల సురేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తఓటరు నమోదుకు ఫారం 6 ఓటర్లు తొలగింపులకు ఫారం 7ను ఓటర్ లిస్టులో పేర్లు తప్పులు దొర్లిన, ఎడల ఫోటోలు తప్పులు పడిన యెడల పుట్టిన తేదీలు సవరణలకు ఫారం 8 పూర్తి చేయించి నా దరఖాస్తులను సేకరించాలని బీఎల్వోలకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఈ నెలలో 10 , 23, 24 తేదీలలో ఓటర్ ప్రత్యేక క్యాంపెయిన్ డే ను నిర్వహించడం జరుగుతుందని ఓటర్లు ఓటునమోదుకు సవరణలకు బిఎల్ఓ వద్దకు వెళ్లి వాటికి సంబంధించిన ఫారాలను పూర్తి చేసి బిఎల్ఓలకు అందజేయాలని సూచించారు. తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్ వినోద్ బీఎల్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-(త్రిపురాంతకం) : త్రిపురాంతకం మండలంలోని పోలింగ్ కేంద్రాలను వై పాలెం నియోజక వర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి సత్య నారాయణ పరిశీలించారు. మండలంలోని కేశినేనిపల్లి, త్రిపురాంతకంలో వున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడ వున్న బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలు సంబంధించిన ప్రత్యేక డ్రైవ్లో మరణించిన వారి వివరాలు సేకరించి వాటికి సంబంధించిన మరణ ధృవీకరణ పత్రాన్ని సేకరించి దానిని అధికారులకు సమర్పించాలని అన్నారు.వివాహాలు జరిగి వేరే ప్రదేశాలకు వెళ్లిన వారి వివరాలను సేకరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, త్రిపురాంతకం తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు..

'పల్లె నిద్ర'తో ప్రజా సమస్యలపై అవగాహన

- అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజల మధ్యకే పోలీసులు వెళ్లాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ తుషార్ డూడి పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అన్నారు. శుక్రవారం రాత్రి గుళ్ళపల్లి గ్రామంలో రేపల్లె రూరల్ సీఐ సురేష్ బాబు స్థానిక ఎస్సై టి.అనిల్ కుమార్‌తో కలిసి పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పోలీసు అధికారులు ప్రతి శుక్రవారం వారి పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామంలోని సమస్యల గురించి అడిగి తెలుసుకుంటారన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి వాటి బారిన పడకుండా ఏ విధంగా అప్రమత్తంగా వ్యవహరించాలి అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాల గురించి చెడు నడత కలిగిన వ్యక్తుల యొక్క సమాచారాన్ని సేకరించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయో వాటి బారిన పడకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా వ్యవహరించాలి అనే విషయాలను గురించి ప్రజలకు వివరించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం వలన మద్యం మత్తులో వారు ఏదైనా నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుంది కనుక శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నేరాలను కట్టడి చేసే ఉద్దేశంతో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ అధికారులకు లేదా 100,112 నెంబర్లకు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠానికి బస్ సర్వీస్ ప్రారంభం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి నుంచి బ్రహ్మంగారి మఠానికి నూతన బస్సు సర్వీసును శనివారం అద్దంకి ఆర్టీసీ డిపో మేనేజర్ బెల్లం రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు అద్దంకి డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి దర్శి, పొదిలి, బేస్తవారిపేట, పోరుమామిళ్ల మీదుగా 11 గంటలకు బ్రహ్మంగారి మఠానికి చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మంగారిమఠంలో బయలుదేరి సాయంత్రం 5.45 గంటలకు అద్దంకి చేరుతుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు వితరణ

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం పురస్కరించుకొని టీడీపీ నాయకులు దామ హనుమంతరావు సౌజన్యంతో అద్దంకి మున్సిపాలిటీలో పనిచేస్తున్న వందమంది పారిశుధ్య కార్మికులకు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద దుప్పట్లు పంపిణీ చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధ

విశాలాంధ్ర - చీరాల : చదువుతో పాటు చట్టాలపై యువత అవగాహన ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధ అన్నారు. శనివారం చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వైఎ డిగ్రీ కళాశాలలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధ మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా వుండాలంటే చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే అధికారులు సత్వరమే స్పందిస్తారని యువత తమ హక్కుల కోసం చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రమేష్ బాబు,కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నీలా కుమారి,చీరాల వన్ టౌన్ ఎస్సై కమలాకర్,న్యాయవాదులు ఏ.రామకృష్ణారెడ్డి,జీకే ఈశ్వరి రెడ్డి,రాజేశ్వరి,కళాశాల ఇంగ్లీషు అధ్యాపకురాలు జి.రత్న పాప,పిఎల్ వీలు సయ్యద్ మతీన్,జివి సాయి కృష్ణ,కళాశాల అధ్యాపకులు,విద్యార్థినులు,కళాశాల, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో పరిశీలన

విశాలాంధ్ర - రేపల్లె : ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి 90 రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గం రేపల్లె వారు నవంబర్ 9,10 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహించారు. ఎన్నిక కమీషన్ వారి ఉత్తర్వులు ప్రకారం శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించు నిమిత్తం రేపల్లె మండలం పెనుమూడి,రేపల్లె అర్బన్, చెరుకుపల్లిల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం వరకు వచ్చే క్లెయిమ్స్ తీసుకోవాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవోతో పాటు తహసీల్దార్ ఎం.శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ సాంబశివ రావు, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం పూజలు

విశాలాంధ్ర - అద్దంకి : పవిత్ర కార్తీక మాసం కోటి సోమవారం పురస్కరించుకొని మండలంలోని మణికేశ్వరం గ్రామంలో వెంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్తులు షేక్ కరీముల్లా,అంజయ్య తదితరులు భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేశారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

-మతోన్మాద విధానాలు ఆపకపోతే కూటమి ప్రభుత్వానికి వైసీపీగతే

-సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజలకి భారంగా మారుతున్నా ధరలు తగ్గించాలిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలా కార్పొరేట్ మతోన్మాద విధానాలు ఆపకపోతే పాత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. శనివారం స్థానిక మైనేని సీతారామయ్య కళ్యాణ మండపంలో సీపీఎం రెండో మహాసభ జరిగింది. ఈ మహాసభకు కామ్రేడ్ అమిరినేని లక్ష్మయ్య ప్రాంగణంగా నామకరణం చేయటం జరిగింది. మహాసభలు ప్రారంభానికి ముందు సీనియర్ సభ్యులు యార్లగడ్డ శివయ్య జెండా ఆవిష్కరించారు. అమరులైన సీపీఎం అఖిలభారత ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి,రేపల్లె తాలూకా సీనియర్ సభ్యులు అమిరినేని లక్ష్మయ్యలకు,చనిపోయిన పలువురు సీపీఎం నేతలు,వామపక్ష పార్టీల నాయకులకు సంతాపం తెలిపారు. అనంతరం నూతన సీపీఎం రేపల్లె పట్టణ కమిటీ 7మందితో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యదర్శిగా తిరిగి సిహెచ్. మణి లాల్,పట్టణ కమిటీ సభ్యులుగా కె.ఆశీర్వాదం,కేవీ. లక్ష్మణరావు, జె.ధర్మరాజు, ఎన్. శివశంకర్, కె.ఝాన్సీ,నాగరాజు, ఆహ్వానితులుగా వై. కిషోర్ కే. రమేష్,కే.వెంకట్ ఎన్నికయ్యారు.

ఘనంగా మంత్రి గొట్టిపాటి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు జన్మదిన కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర,తహసీల్దార్ శ్రీ చరణ్,మున్సిపల్ వైస్ చైర్మన్ దేసు పద్మేష్,టీడీపీ నాయకులు రంగిశెట్టి లహరి,కుందారపు రామారావు,దామా హనుమంతరావు,చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు,సంధి రెడ్డి రమేష్, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

విశాలాంధ్ర - కారంచేడు : శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు స్థానిక ఎస్సై వి.వెంకటరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. మండలంలో ఎక్కడైన ఎలాంటి అల్లర్లు జరిగినా సహించేది లేదని సత్ప్రవర్తనతో ఉండాలని చెప్పారు.

జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నజీముద్దీన్

విశాలాంధ్ర - పర్చూరు : ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ఉద్యోగుల అధ్యక్షునిగా మహమ్మద్ నజీముద్దీన్‌ని యమించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీర్జా తెలిపారు. స్థానిక ఐటిఐ కళాశాలలో సంఘం ప్రతినిధులు సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ముస్లింల సంక్షేమానికి సంఘం కృషి చేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఖాజావలి, కరిముల్లా, గౌస్ బాబు, మాబుల్లా తదితరులు ఉన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-పర్చూరు: అర్హత కలిగిన యువతి, యువకులు ఓటు నమోదుకు దరఖాస్తులు అందించాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు శనివారం స్పెషల్ క్యాంపెయిన్ డే సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బిఎల్ఓలు విధులు నిర్వహించారు. పర్చూరులోని 141 పోలింగ్ కేంద్రం నుండి 146 వరకు తహసీల్దార్ సందర్శించి ఓటు నమోదును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుకు, మార్పులకు ఆదివారం కూడా అవకాశం ఉన్నదని, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు. వారితో పాటు ఎంఆర్ఐ బి.ప్రేమ్‌కుమార్, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

'పెదపూడి'కి అభినందనలు

విశాలాంధ్ర-పర్చూరు: కూటమి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు ని యోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ పెదపూడి విజయకుమార్ ను ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించారు. విజయకుమార్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

బాబాను దర్శించుకున్న బీజేపీ మైనార్టీ నాయకులు

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల కేంద్రమైన నిజాంపట్నంలో వేంచేసియున్న హజరత్ సయ్యద్ జైనుల్లాబ్దీన్ బాబా వలియా 74వ ఉరుసు మహోత్సవం శనివారం వైభవంగా జరుగుతున్న సందర్భంగా బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మైనార్టీ మోర్చా మెంబర్ అబ్దుల్ ముజీబ్, బీజేపీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు యాఖతలి బేగ్ కలిసి దర్గాను సందర్శించి బాబా వలియాను దర్శించుకున్నారు.బాబా వలియా ఎంతో మహిమ గల వారని, ఉరుసు మహోత్సవం సందర్భంగా బాబా వలియాను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు తెలిపారు.

నిజాంపట్నంలో ఆధార్ కేంద్రం

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల కేంద్రమైన నిజాంపట్నంలోని ఒకటవ సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి తెలిపారు.శనివారం ఆమె మాట్లాడుతూ మండలంలోని నిజాంపట్నంలో ఆధార్ కేంద్రం ఉన్నప్పటికీ ఇటీవల సచివాలయం డీఎ బదిలీపై వెళ్లడంతో ఆధార్ సేవలు నిలిచాయన్నారు.ఈ కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.శనివారం నుంచి ప్రజలకు నిజాంపట్నం సచివాలయం - 1 లో ఆధార్ కేంద్రం అందుబాటులో ఉంటుందని, ప్రజలందరూ తమ ఆధార్ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీడీవో సూచించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - రేపల్లె : మారిన చట్టాలకు అనుగుణంగా పురుషులతో పాటు మహిళలకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ కోర్టులు చట్టాలు చేశాయని వాటి పట్ల అవగాహన ఉండడమే కాకుండా చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి. వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో అంగన్వాడీ వర్కర్లు,సూపర్‌వైజర్లకు రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్, క్రిమినల్, కేసులు పురుషులతో పాటు మహిళలకు కూడా వర్తిస్తాయని ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన నూతన చట్టాలు పట్ల మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు,వరకట్న నిషేధం,భార్యాభర్తలు వివాదాలు,ఆస్తి తగాదాలు,భరణం మనోవర్తి, ప్రామిసరీ నోట్, మానవ అక్రమ రవాణా ఫోక్స్ చట్టం తదితర చట్టాల గురించి వివరించారు.ఏదైనా కేసులు విషయంలో తగు సూచనలు సలహాలు తెలుసుకోవాలంటే స్థానిక న్యాయస్థాన నందు కోర్టు అధికారులు కానీ, న్యాయమూర్తిని సంప్రదించాలన్నారు.ఆర్థిక స్తోమత లేని వారు ఎస్సీ,ఎస్టీల కేసులు పరిష్కారం కోసం అవసరమైతే న్యాయస్థానం ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసి కేసులను వాదించేందుకు న్యాయవాదిని ఏర్పాటు చేయటమే కాకుండా,అందుకు అయ్యే ఖర్చును కూడా న్యాయస్థానమే భరిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం నవంబరు 9వ తేదీ జాతీయ న్యాయ సేవల దినోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు.ఇందులో ముఖ్యంగా మహిళలు చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం చట్టాల పట్ల విషయాలు తెలుసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. రేపల్లె మండల పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు,ఆర్.శ్రీనివాసరావు, ఎం.చిన్న యానాదిరావులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 9వ తేదీ జాతీయ న్యాయ సేవల దినోత్సవం జరుపుకోవడం అందుకు అనుగుణంగా సుప్రీంకోర్టు, హైకోర్టు జారీ చేసిన నూతన చట్టాలు వాటి వలన కలిగే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. మారిన చట్టాలు ప్రస్తుత అమల్లో ఉన్న చట్టాలు గురించి పురుషులతో పాటు స్త్రీలు కూడా తెలుసుకొని ఏ ఏ చట్టాల వలన ప్రయోజనాలు నష్టాలు ఉంటాయో ఆ చట్టాల గురించి ఈరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొండపల్లి శ్రీనివాసరావు, ఒడుగు రాంబాబు, పవన్ కుమార్,దీవి హరికుమార్, పోతురాజు, రేయి నాగరాజు, సంజయ్, ఆరేపల్లి మధుసూదన్రావు,పారా లీగల్ వాలంటీర్ సయ్యద్ తాహిర్ అహ్మద్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు జ్యోతి,రజిని, వాణిశ్రీ, అరుణ, వెంకటరత్నం, మాణిక్యం, కార్యాలయ డిజిటల్ అసిస్టెంట్ సుమన్,అంగన్వాడీ వర్కర్లు,సూపర్వైజర్లు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో బిజీ బిజీగా ఏలూరి,నరేంద్రవర్మ

విశాలాంధ్ర - యద్దనపూడి : న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివ రావు,నరేంద్ర వర్మ బిజీ బిజీగా గడిపారు.మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు వెళ్లిన ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను న్యూజిలాండ్ తెలుగు వాసులకు వివరించారు.న్యూజిలాండ్ ప్రధానమంత్రి మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు.సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పారిశ్రామిక విధానాలను వివరించారు.అలాగే విద్యుత్ శాఖ మంత్రి సిమియన్ బ్రౌన్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.అక్కడ విద్యుత్ విధానాలను అడిగి తెలుసుకున్నారు.అలాగే న్యూజిలాండ్లో నూతన వ్యవసాయ సాగు విధానాలను అధ్యయనం చేశారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. న్యూజిలాండ్ పర్యటనలో ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులను కలుస్తూ పార్టీ అభివృద్ధికి ప్రణాళికలు, ఏపీ అభివృద్ధికి ప్రవాస భారతీయులు చేస్తున్న కృషి తదితరంశాలపై కీలకంగా చర్చించారు.శనివారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను బిజెపి న్యూజిలాండ్ నేతలు సోహన్ మిట్టల్,శేఖర్ అగర్వాల్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో న్యూజిలాండ్ నేషనల్ పార్టీ ప్రతినిధులు శివ కిలారి,బాల వేణుగోపాల్ వీరం,టిడిపి న్యూజిలాండ్ కోఆర్డినేటర్ జితేందర్ నిమ్మగడ్డ,మన

ఆంధ్ర తెలుగు అసోసియేషన్ నేతలు మద్దుకూరి దిలీప్,అశోక్ గోరంట్ల,న్యూజిలాండ్ ఎన్నారై టిడిపి అసోసియేషన్ నాయకులు తదితరులు ఉన్నారు.

డీఈవో పురుషోత్తంని కలిసిన అపుస్మా ప్రతినిధులు

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు నియోజకవర్గ అపుస్మా అధ్యక్షులు తేళ్ల వెంకట రాము శనివారం బాపట్ల డిఈఓ పురుషోత్తంని ఆయన కార్యాలయంలో పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.ప్రైవేటు విద్యా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి డీఈఓతో చర్చించారు.ఈయన వెంట అపుస్మా జిల్లా గౌరవ అధ్యక్షులు తోటకూర విజయ్ భాస్కర్, అపుస్మా నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాదెండ్ల లక్ష్మయ్య చౌదరి ఉన్నారు.

Before the Hon'ble Deputy Registrar of Chits, Guntur
Dispute No. 80 / 2023
Between :
M/s.Margadarsi Chit Fund Pvt.Ltd., Rep. by its Senior Manager, Arundel pet Branch, Guntur. ...Disputant
And
Mr. T. Kumar Babu & Others ...Opponents
To:
OPP. No.5: Mr.Gali Subba Rao, S/o. Sivaramaiah, Asst. Line Man, O/o. A.E./O/APCPDCL, Lingasamudram (Po & M), Prakasam Dist.
Please take notice that the above dispute is filed against opponents for Recovery of amount. The Opp.5 is not take the Court notices from Hon'ble Deputy Registrar of chits, Guntur. Hence the suit is posted to **Dt.12-11-2024** for the appearance of you before the Deputy Registrar of Chits, Guntur at **10:30 a.m.** by person or through an advocate. If you are fail to attend so, the matter will be heard and decided exparte basis on the material available.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Guntur.)
Foreman / Senior Branch Manager, M/s. Margadarsi Chit Fund Pvt, Ltd., Arundelpet Branch, Guntur. Cell: 9618771325

Before the Hon'ble Deputy Registrar of Chits, Guntur
Dispute No. 79 / 2023
Between :
M/s.Margadarsi Chit Fund Pvt. Ltd., Rep. by its Senior Manager, Arundel pet Branch, Guntur. ...Disputant
And
Mr. A.Bhaskara Rao & Others ...Opponents
Opp. No.2: Mr.Pallepogu Ravi, S/o Poul, Live Stock Asst., O/o Veterinary Dispensary, R.L.Unit, Chintapalli Padu,Yaddanapudi(M),Prakasam Dt.
Opp. No.5: Mr.Sonti Radha Krishna, S/o Venkateswara Rao, Nagayalanka (PO&M), Krishna Dist.
Please take notice that the above dispute is filed against opponents for recovery of amount. The Opponent No's. 2 & 5 are not take the court notices from Hon'ble Deputy Registrar of chits, Gunturt. Hence the suit is posted to **12-11-2024** for appearance of you before the Deputy Registrar of Chits, Guntur at **10.30 AM** by person or through an Advocate. If you are fail to attend so, the matter will be heard and decided exparte basis on the material available.
(By the Order of the Hon'ble Deputy Regidtrar of Chits, Guntur)
Foreman / Senior Branch Manager, M/s. Margadarsi Chit Fund Pvt, Ltd., Arundelpet Branch, Guntur. Cell: 9618771325

ఉపాధ్యాయుడిని శిక్షించాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం కారుమంచి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పది సంవత్సరాల పేద వ్యవసాయ కూలీల బిడ్డ దళిత బాలికపై గత మూడు రోజుల క్రితం మధ్యాహ్న భోజన సమయంలో క్లాస్ రూమ్‌లోనే అత్యాచారం చేసిన ఉపాధ్యాయుని వెంటనే అరెస్టు చేయాలని అతని విధుల నుంచి శాశ్వతంగా తప్పించాలని ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈరోజు ఒంగోలు రిమ్స్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలకు వచ్చిన బాలిక తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడి అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ ఉన్నారు. అభం శుభం తెలియని చిన్నారి పసిబిడ్డను పైశాచికంగా రక్తం వచ్చే విధంగా బలాత్కరించడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. బాలికను పరామర్శించడానికి కూడా పోలీసులు అనుమతించక పోవడం సమంజసం కాదని ఇది వ్యక్తి స్వేచ్ఛని హరించడమేనని ఘటన జరిగి మూడు రోజులైనా కేసు నమోదు చే చేయక పోవడం పోలీసుల అలసత్వానికి, రాజకీయ జోక్యానికి నిదర్శనమని సైదా అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్టుమెంట్ చైర్మన్ చిలక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళిత బాలిక మీద అత్యాచారం చేస్తే పోలీసులు విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదని ఆ కుటుంబానికి న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున మాట్లాడుతూ దోషులను వెంటనే శిక్షించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహిస్తామని బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వద్దండి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనం ప్రసన్న రాజు, మాజీ అధికార ప్రతినిధి బొద్దు సతీష్ లు మాట్లాడుతూ అన్యం, పుణ్యం ఎరగని చిన్నారి బాలికపై విద్యాబుద్ధులు నేర్పవలసిన ఉపాధ్యాయుడే ఇలాంటి దుచ్చేరిలకు పాల్పడటం హేయమైన చర్యని వారు అ న్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఈ ఘటనకు బాధ్యులైన ఉపాధ్యాయుడు పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పయనం మధు, సతీష్, ప్రసాద్, హరీష్ పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో సకల శుభాలు

విశాలాంధ్ర - రేపల్లె : టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటు మెరక జలార్తమ్మ కాలనీ ఎస్సీ కాలనీలో నిర్మాణమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ వార్షికోత్సవం,రెండవ శనివారాన్ని పురస్కరించుకొని స్వామివారికి సామూహిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ కార్యక్రమం అర్చకులు కట్టా మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, రేపల్లె చెంచయ్య, శ్రీకృష్ణయ్య,బొల్లిముంత సుందరామిరెడ్డి,కామయ్య,వీరరాఘవయ్య,పున్నమ్మ,బుల్లిబాబు,అర్చకులు కట్టా మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో డ్రగ్ కల్చర్ కు అడ్డు కట్ట వేసి విద్యార్థుల జీవితాన్ని రక్షించాలని ఎన్ ఎస్ యు ఐ జాతీయ కార్యదర్శి, ఏపీ రాష్ట్ర ఇంచార్జ్ రాజీవ్ గాంధీ డిమాండ్ చేశారు. ఒంగోలులో ఎం ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ఆంటీ డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగా ఒంగోలు మంగమూరు జంక్షన్ నుండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలచంద్రుడు నాయక్ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నగర అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఉద్దండి మల్లికార్జున, బుజ్జి సతీష్, ఎం ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పశుగణన చేపడుతున్న ఎన్యుమ రేటర్ సిబ్బందికి రైతులు సహకరించాలని పశువైద్యాధికారిని ఎం విజయలక్ష్మి కోరారు. అఖిలభారత 21వ పశుగణన కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేటర్స్ గ్రామాల్లో ప్రతి ఇంటింటికి తిరిగి పశు గణన చేస్తున్నారని అన్నారు. రైతులు ఎన్యుమరేటర్ సిబ్బందికి సహకరించి గేదెలు వివరాలు తెలియజేయాలని కోరారు. మండలంలో 15,530 గేదెలు ఉండగా ఇప్పటివరకు పలు గ్రామాలలో 830 గేదెల వివరాలు సేకరించినట్లు ఆమె తెలిపారు. ఈ పశుగణన కార్యక్రమం జనవరి నెల వరకు ఉంటుందని తెలిపారు. జేవిఓ కే కోటిలింగం, పశు వైద్య ఎన్యుమరేటర్స్ జె రవి, జి వెంకటేశ్వర్లు, వి అనుష, పి కుసుమ, ఎస్ సుజాత, నాగరాజులు పాల్గొన్నారు.

శభాష్ ఫ్రెండ్లీ పోలీస్

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండల సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర నాయక్ తనదైన శైలితో శభాష్ అనిపించుకుంటూ ముందుకు దూసుకెళ్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి కొమరోలు టౌన్‌లో, తాటిచెర్ల మోట్ ఏరియా వరకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు గిద్దలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకోటయ్య కొమరోలు పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సమయంలో అక్కడ చేస్తున్న మరమ్మత్తు పనులను పరిశీలించి నూతన పోలీసు వాహనం పరిశీలించి పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న పనులను గుర్తించి కొమరోలు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర నాయక్ ను సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకోటయ్య అభినందించారు.

గురువులకు సన్మానం

విశాలాంధ్ర-తర్లుపాడు : 1988- 89 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థినీ, విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకంగా ఉందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గాయం.శ్రీనివాసరెడ్డి.ఆదినారాయణ రెడ్డి, భవనం. శ్రీనివాసరెడ్డి, దొండేటి. వెంకటేశ్వర్లు, కొప్పుల. వెంకటేశ్వరరెడ్డి, గాలెయ్య, అరవీటి సుబ్బయ్య, నాగేశ్వరరావు, సత్యనారాయణ, మాలపాటి. ఆదినారాయణ రెడ్డి, దేవిరెడ్డి. ఆంజనేయరెడ్డి, చలమారెడ్డి, బ్రహ్మయ్య, నాసరయ్య, వెంకటేశ్వర్లు, ఎస్.కె సత్తార్, తదితరులు 30 మందికి పైగా పాల్గొన్నారు.

11న నల్లమడగలలో
విజయోత్సవ సభ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి నియోజకవర్గం సిఎస్‌పురం మండలంలోని నల్లమడగల గ్రామస్తులు సోమవారం మందకృష్ణ మాదిగ ఒంగోలు పట్టణానికి రానున్న సందర్భంగా స్వాగతం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మందకృష్ణ మాదిగ తరపున సామాజిక ఉద్యమ నమస్కారాలు తెలియజేసిన కనిగిరి నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కో ఇన్‌ఛార్జి జేపి రాజు మాదిగ సిఎస్ పురం మండల అధ్యక్షులు బలబద్ర శీను మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు నేదరపల్లి బెంజిమెన్ మాదిగ సామాజిక ఉద్యమ నమస్కారాలు గ్రామ సర్పంచ్ సూరిపోగు ఆంటోనీ మరియు సూరి పోగు చెన్నయ్య సూరిబాబు గురవయ్య రాజయ్య ప్రశాంతు రాజేషు ప్రసంగి జిచిట్టి శేఖర్ కొండయ్య ఇల్లారి ప్రసాద్ ఆశీర్వాదం మరియు గ్రామస్తులు అందరికీ మందకృష్ణ మాదిగ తరపున సామాజిక ఉద్యమ నమస్కారాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను
ఈఆర్వో పరిశీలన

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని తాళ్లూరు, శివ రామ పురంలలో పోలింగ్ కేంద్రాలను దర్శినియోజక వర్గ ఈఆర్ఏ, డిప్యూటీ కెక్టర్ ఎం వి ఎస్ లోకేశ్వర రావు పరిశీలించారు. ఓటర్ల జాబితా చేర్పులు, మార్పుల పరిశీలన నిమిత్తం ఆయా పోలింగ్ కేంద్రాలలో ప్రచురితం కాబోయే ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచటంతో ఆయన పరిశీలించి బి ఎల్ ఓలకు తగిన సూచనలు చేసారు. తాళ్లూరు మండలంలో 46 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 37,736 మంది ఓటర్ల నమోదు అయినట్లు అందులో 19,040 పురుషులు, 18,696 మంది మహిళలు ఉన్నారు. పరిశీలనలో డిప్యూటీ తహసీల్దార్ డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా మొర్రి పిచ్చయ్య ఎంపిక

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసింది. వీరు యశ్వంత్ ఎడ్యుకేషన్ సొసైటీ స్థాపించి తద్వారా తన వార్షిక వేతనంలో 20 శాతం నగదును పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యాభివృద్ధికి మరియు పాఠశాల భౌతిక మౌలిక సదుపాయాలకు ఖర్చు చేస్తున్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షల పట్ల అవగాహన కల్పించి జాతీయస్థాయి పోటీ పరీక్షలు రాస్తున్నారు. 40 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక కావడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఈ అవార్డుకు అప్లై చేయించి, మార్గదర్శకత్వం ఇచ్చి నటువంటి తన సహోపాధ్యాయులకు, మిత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అవార్డు రావడం తనకు ఆనందాన్ని కలిగించిందని, తన బాధ్యతను పెంచిందన్నారు.

కీచక ఉపాధ్యాయుడిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు : దళిత విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డ కారుమంచి జెడ్పీ హైస్కూల్ ఎన్విరాన్మెంట్ టీచర్‌ను అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం రిమ్స్లో ఉన్న విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులను పరామర్శించేందుకు వెళ్లిన నాగేంద్రను మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వేమూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబులతోపాటు పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాస రావును నాయకులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నేరాలు జరుగుతూనే ఉంటాయనీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దళితులపై జరుగుతున్న దాడులు, అత్యాచార ఘటనలపై కేసులు నమోదు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావు తదితరులు ఉన్నారు.

దొనకొండలో నూతన సీసీ కెమెరాలు ఏర్పాటు

విశాలాంధ్ర-దొనకొండ: దొనకొండ పట్టణంలోని ప్రధాన కూడళ్ళల్లో నూతన సీసీ కెమెరాలను స్థానిక ఎస్ఐ కె.విజయకుమార్ ఏర్పాటు శనివారం చేయించారు. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాలు మరమ్మతులు కావటంతో దాతల సహకారంతో నూతన కెమెరాలు కొనుగోలు చేసి డా.బిఆర్. అంబేద్కర్, వైఎస్ఆర్, ఎన్‌టీఆర్ విగ్రహాల కూడళ్ళు, ఎంపీడీఓ కార్యాలయం, రైల్వే స్టేషన్ ఆవరణ తదితర ప్రధాన ప్రాంతాల్లో అమర్చారు. నేరస్తులను, గుర్తు తెలియని దుండగులను గుర్తించేందుకు ఈ కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని, వీటి ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించిన దాతలకు పోలీస్ సిబ్బంది ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా బత్తుల అశోక్

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : సీపీఐ బాపట్ల పట్టణ కార్యదర్శిగా మామిడి బత్తుల అశోక్‌ను సీపీఐ పట్టణం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పట్టణ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. పట్టణ కౌన్సిల్ మెంబర్ వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా ఈనెల 18న సచివాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు నివాస స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక తోడ్పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్ మాట్లాడుతూ పట్టణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ నాపై ఉన్న నమ్మకంతో అప్ప చెప్పిన బాధ్యతలను సక్రమంగా నిర్వ హిస్తూ పట్టణంలో ఉన్న పేద బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు జెబి శ్రీధర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్క వెంకట రామకృష్ణారెడ్డి, పోలిరెడ్డి,ఫణీంద్ర,కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పాపారావు

విశాలాంధ్ర – రేపల్లె : ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రేపల్లె మండలం లంకె వాని దిబ్బ గ్రామానికి చెందిన సర్పంచ్ చిలకలపూడి పాపారావు నియమితులయ్యారు. ఆంధ్రరాష్ట్ర సర్పంచుల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటూ వైసీపీకి ఎన్నికలకు ఏడాది ముందే రాజీనామా చేసి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ సమక్షంలో పాపారావు చేరారు. రేపల్లె రూరల్ మండలం నిజాంపట్నం మండలాల్లో జనసేన క్యాడర్ను టిడిపికి ఓటు వేసేలా కృషిచేసిన చిరకాలపూడి పాపారావును జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పాపారావును నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా రేపల్లె జనసేన పార్టీ తరపున పాపారావుకు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు ఆర్. మహేష్,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాపారావును అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కుడలల్లో టపాసులు పేల్చి బాణాసంచా కాల్చారు.

ఏపీ హ్యాండ్లూమ్‌కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా సజ్జ హేమలత

విశాలాంధ్ర – చీరాల : తెలుగు దేశం పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని డాక్టర్ సజ్జా హేమలత అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్ పదవులలో చీరాలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు డాక్టర్ సజ్జ హేమ లతకు ఏపీ హ్యాండ్ లూమ్ కోపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా పదవి లభించింది. 2024 ఎన్నికలలో చీరాల నియోజకవర్గం నుండి టికెట్ ఆశించి లభించకపోయినా పార్టీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్యను అధిష్టానం ప్రక టించిన నాటి నుండి పార్టీ గెలుపు కోసం నియోజకవర్గంలో పనిచేసిన సజ్జ హేమలత కష్టానికి ఫలితం చైర్మన్ పదవి రూపంలో దక్కిందని పలు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తనను నమ్మి బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం తగదు

◆ విగ్రహ ఏర్పాటుకు అధికారులు సహకరించకపోతే కోర్టుకు వెళతా

◆ బాపట్ల వైసీపీ ఇన్‌ఛార్జి ,మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : బాపట్ల పట్టణంలో ప్రముఖుల విగ్రహాలు ఏర్పాటుకు రాజకీయాలు అంటగట్టడం సరికాదని బాపట్ల వైసీపీ ఇన్చార్జ్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల వైసీపీ కార్యాల యంలో శనివారం మీడియా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో 2007వ సంవత్సరానికి ముందే ఆర్అండ్‌బి రహదారిగా ఉన్నప్పుడు విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారి అయిన తర్వాత కొత్తగా ఏదైనా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటే అనుమతి కావాలి కానీ అంతకు ముందు ఉన్న విగ్రహాలను తిరిగి అదే స్థానంలో ఏర్పాటు చేసుకోవటానికి అనుమతులు అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు,రాజకీయ ప్రముఖుల విగ్రహాల ఏర్పాటుపై రాజకీయం ఎందుకు చేస్తున్నారని కొంతమందికి అవగాహన లేక అనుమతి తీసుకోవాలి కదా అని మాట్లాడు తున్నారని ఆయన వివరణ ఇచ్చారు. విగ్రహ ఏర్పాటుకు అధికారులు సహకరించకపోతే అవస రమైతే కోర్టుకు వెళతనన్నారు. బాపట్ల ప్రాంతం నుంచి రాజకీయంగా తనదైన ముద్ర వేసుకున్న స్వర్గీయ కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటును ఎవరు అడ్డుకున్న బాపట్ల ప్రజలు వారిని క్షమించ రన్నారు. బాపట్ల పట్టణాన్ని విద్యా కేంద్రంగా, బాపట్ల పట్టణానికి తాగునీరు అందించిన మహనీయు లుగా, గవర్నర్‌గా, మంత్రిగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన ప్రముఖమైన వ్యక్తి కోన ప్రభాకర్‌రావు అన్నారు. కేవలం కోన రఘుపతి మీద ఉన్న రాజకీయ కక్షతో కోన ప్రభాకర్ రావు విగ్రహాన్ని వ్యతిరేకించడం సరికాదన్నారు. రాత్రి పూట ఎందుకు విగ్రహం ఏర్పాటు చేయాలి అని కొంతమంది తెలియకుండా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం ఏ పని చేసిన రాత్రి పూట వాహనాల సంచారం తక్కువగా ఉన్న సమయంలోనే చేస్తారని కనీసం ఈ విషయం కూడా ఆ మాట్లాడే వారికి తెలియదా అన్నారు. ఈ విగ్రహ ఏర్పాటుపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌ను కలిసి తెలియజేశామని మున్సిపల్ కమిషనర్‌తో కూడా మాట్లాడమన్నారు. మున్సిపల్ కమిషనర్ కూడా సానుకూలంగా స్పందించారని,బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత వారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారన్నారు.

మాకైతే ఏమి తొందరలేదని అందరూ కూడా కోన ప్రభాకర్ రావు విగ్రహ ఏర్పాటుకు సానుకూలంగానే స్పందిస్తారన్నారు. ఒకవేళ అలా జరగకపోతే న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామని ఆయన తెలియజేశారు. ఆయన వెంట పట్టణ మండల కన్వీనర్లు కాగిత సుధీర్ బాబు,కోకి రాఘవరెడ్డి యల్లావుల ఏడుకొండలు, నారపరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, జోగి రాజా,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి ఉన్నారు.

టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలి

◈వైసీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

◈వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో – బాపట్ల : కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూటమి నేతలకు వైసీపీ నేతలు కార్యకర్తలపై కక్షసాధింపు తప్పా మరో వ్యాపకం లేదని వైయస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. వైసీపీ నేతలపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్పీ తుషార్ దూడీకి శనివారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంపై దృష్టి పెట్టకుండా కక్ష్యసాధింపులతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారన్నారు. చంద్రబాబు అబద్దాల ఫ్యాక్టరీని ఎప్పటి నుండో నడుపు తున్నాడన్నారు. డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబుకు అలవాటుగా మారిందని ఆరోపించారు. మాజీ సీఎం వైయస్ జగన్, ఆయన కుటుంబంపై వచ్చిన సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎస్పీకి ఫిర్యాదు చేసిన వారిలో బాపట్ల నియోజకవర్గ ఇంచార్జీ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, అద్దంకి ఇంచార్జీ హనిమిరెడ్డి, రేపల్లె ఇంచార్జీ డాక్టర్ ఈవూరి గణేష్, పార్టీ నాయకులు కాగిత సుధీర్‌బాబు, వడ్డిముక్కల డేవిడ్, కోకి రాఘవరెడ్డి, జోగి రాజా, చింతల రాజశేఖర్ తదితరులున్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తత అవసరం: డాక్టర్ ప్రణవీ

విశాలాంధ్ర – నిజాంపట్నం : క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రణవీ అన్నారు. శనివారం మండలంలోని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా నివారణ సులభతరం అవుతుందని తెలిపా రు. మంచి అలవాట్లు, ఆరోగ్య కరమైన ఆహారంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనవచ్చునని, క్రమం తప్పని వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ధూమపానం, మత్తు పానీయాలకు దూరంగా ఉండి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర – చీరాల : షెడ్యూలు కులాల వర్గీకరణ తీర్పును దేశవ్యాప్తంగా ఉన్న దళిత మేధావులు సంఘాలు సమూహాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని,కేంద్రంలోని పాలక వర్గాలు తమ నిర్ణయాలను కోర్టు తీర్పులు ద్వారా ప్రజలపై రుద్దుతున్నాయని సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును పునరాలోచన చేయాలని మా ప్రతినిధులు అన్నారు. శనివారం చీరాల అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో వర్గీక రణను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పలువురు వక్తలు మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. దేశంలో తొలిసారి సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పును ఎస్సీ,ఎస్టీ మైనారిటీ ప్రజలు సంఘా లు తీవ్రంగా వ్యతిరేకిస్తు ంగా మాట్లాడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ విషయంలో పునరాలోచన చెయ్యాలని నవంబర్ 15వ తేదీన మాల బహిరంగ సభ అనంతపురంలో నిర్వహిస్తామని తెలి పారు. మాల మహ సభ నాయకులు మాచవరపు జూలియన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాల మహ సభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు,దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు చప్పిడి వెంకట్రావు,మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్,కొండల రావు,మల్లెల బుల్లిబాబు,మేరిగ రమేష్ బాబు,ఎద్దు శశికాంత్,దార్ల శాస్త్రి,దేవరపల్లి బాబురావు,23జిల్లాల మాల మహసభ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.